సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం : 9 : సెప్టెంబర్ : 2024



46.131 టీఎంసీలకు సోమశిల

సోమశిల: జలాశయం ఆదివారానికి 46.131 టీఎంసీలకు చేరుకుంది. 20,407 క్యూసెక్కుల వరద వస్తోంది. పెన్నార్‌డెల్టాకు 550, ఉత్తరకాలువకు 5, దక్షిణకాలువకు 4 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.73,660
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,680
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,880
నవర (8 గ్రాములు)	రూ.55,040

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.7 /28.0

జిల్లాలో సోమవారం వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణంగానే ఉంటాయి. గాలిలో తేమ 59 శాతం ఉంది.

న్యూస్‌రీల్

6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

మర్రిపాడు: మండలంలోని కృష్ణాపురం జవహర్ నవోదయ విద్యాలయంలో 2025–26 విద్యాసం వత్సరంలో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపల్ పీ శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. దరఖాస్తులు పంపే విద్యార్థులు 01.05.2013 నుంచి 31.07.2015 తేదీల మధ్య పుట్టిన వారై ఉండాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో లేదా ప్రభుత్వ గుర్తింపు పాఠశాలలో చదివి ఉండాలన్నారు. ఈ నెల 16వ తేదీలోగా దరఖాస్తులు కేవలం ఆన్‌లైన్ ద్వారా స్వీకరిస్తామని, ఆన్‌లైన్‌లో పంపే వీలు లేకుంటే విద్యాలయంలో సమర్పించవచ్చునని తెలిపారు. దరఖాస్తులు పంపేందుకు ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు సీట్లు కేటాయింపు ఉంటుందన్నారు. 6వ తరగతిలో ప్రవేశానికి అర్హత లభిస్తే జనన ధ్రువీకరణ పత్రం విద్యాలయ కార్యాలయంలో అందజేయాలన్నారు. ప్రవేశ పరీక్ష 2025 జనవరి 18న నిర్వహిస్తామని, వివరాలకు విద్యాలయంలో సంప్రదించాలని కోరారు.

10 నుంచి ‘పొలం పిలుస్తోంది’

నెల్లూరు (సెంట్రల్): ఈ నెల 10వ తేదీ నుంచి ‘పొలం పిలుస్తోంది’ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పొలాల సందర్శన ఉంటుందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి సత్యవాణి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారంలో రెండు రోజులు మంగళవారం, బుధవారం తప్పకుండా రోజుకు రెండు గ్రామాల చొప్పున అధికారులు, సిబ్బంది సందర్శించాల్సి ఉంటుందన్నారు. ప్రధానంగా వ్యవసాయశాఖ అధికారులతో పాటు, ఉద్యాన, మార్కెటింగ్, మత్స్యశాఖ, ఇతర వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొంటారని వివరించారు.

డీసీసీ అధ్యక్షుడిగా చేవూరు మరోసారి..



చేవూరు దేవకుమార్‌రెడ్డిను అభినందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నెల్లూరు (వీఆర్సీసెంటర్): కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా తిరిగి చేవూరు దేవకుమార్‌రెడ్డిని, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఉడతా వెంకట్రావ్‌యాదవ్‌ను పార్టీ అధిష్టానం నియమించింది. దీంతో చేవూరు దేవకుమార్‌రెడ్డి నివాసంలో ఆదివారం పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఆయన్ను అభినందించి, శాలువాలతో సత్కరించారు.

జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారిగా రమేష్



డాక్టర్ రమేష్

నెల్లూరు(సెంట్రల్): నెల్లూరు జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారిగా డాక్టర్ కె.రమేష్‌ను నియమిస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు శనివారం ఆదేశాలు జారీ చేశారు. డాక్టర్ రమేష్ ప్రస్తుతం కావలిలో పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం జిల్లా అధికారిగా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్న కోటేశ్వరరావును యథావిధిగా పాలిక్లినిక్ అధికారిగా నియమించారు. రమేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉందని పేర్కొన్నారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

తోటపల్లిగూడూరు: నిరక్షరాసులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం పనిచేస్తున్నట్లు వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ ఆజాద్ అహ్మద్ అన్నారు. మండలంలోని చెన్నపల్లిపాళెం ఉన్నత పాఠశాలలో ఆదివారం 58వ అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవ వేడుకలు జరిగాయి. ఉపాధ్యాయులు విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వయోజన విద్య ఏపీఓ మస్తాన్‌రెడ్డి, పర్యవేక్షకులు రాజశేఖర్, కృష్ణకిశోర్, రామకుమార్, నారాయణరావు, బాదుల్లా, అంకారావు, రమేష్‌బాబు, హెచ్ఎం సాయిప్రసాద్, టీచర్ ఫణికుమార్ పాల్గొన్నారు.



నవ ముఖ గణపతి



సినీ సెట్టింగ్‌లను తలపిస్తూ నెల్లూరులో ఏర్పాటు చేసిన గణేశ్ మండపం



పంచముఖి, దశ బాహువుల రూపంలోని శ్వేతవర్ణ గణేశుడు



గణపయ్యకు నివేదించిన భారీ లడ్డూ

ఓం గం గణపతియేనమః

సింహపురిలో గణనాథుడు వివిధ రూపాల్లో కొలువై భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధాన కూడళ్లలో భక్త మండళ్ల అభీష్టాల మేరకు బహు బాహువులు, పంచ, నవ ముఖ గణపతులతో పాటు దశ రూపగణపతులు, ముత్యాల గణపతి రూపాల్లో కొలువుదీర్చారు. శనివారం ఉదయం గణపతి మండపాల్లోనూ, భక్తులు తమ నివాసాల్లో మహాగణపతిమ్.. మనసాస్మరామి అంటూ విఘ్నాధిపతిని భక్తిశ్రద్ధలతో పూజించారు. సాయంత్రం నెల్లూరు పెన్నా బ్యారేజీ, ఇరుకళల పరమేశ్వరి ఆలయం పక్కన ఏర్పాటు చేసిన గణేశ్ ఘాట్లో పూజాపత్రి, గణపతులను నిమజ్జనం చేశారు. గణేశుడు కొలువుదీర్చిన మండపాల వద్ద భక్త మండళ్ల ఆధ్వర్యంలో ఉట్టి మహోత్సవం కోలాహలంగా నిర్వహించారు. ఆదివారం పలు మండపాల్లో వినాయకుడి కల్యాణం, బాలాజీనగర్‌లోని లక్ష్మీనగర్‌లో ఎస్‌బీఐ కాలనీలో ఏర్పాటు చేసిన మండపంలో రాత్రి శ్రీనివాస కల్యాణం నిర్వహించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



గణపతిని నిమజ్జనం చేస్తున్న చిన్నారులు



గణేశ్ ఘాట్లో వినాయక ప్రతిమను నిమజ్జనానికి తెచ్చిన యువకులు

ఓం భూం స్వాహా!

కాగితాల్లో ఆస్తులు, ఆక్రమణల్లో భూములు

- పెంచలకోన శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థాన నిర్వహణకు ఆ భూములు రాసిచ్చిన దాత కోట నరసయ్య
- 1942లోనే ట్రస్ట్ డీడ్ ద్వారా దేవస్థానానికి ఆస్తుల బదలాయింపు
- ఆరేళ్ల క్రితం వెలుగు చూసిన రూ.కోట్ల విలువైన ట్రస్ట్ డీడ్ పత్రాలు
- నిషేధిత జాబితాలో ఉంచి చేతులు దులుపుకున్న అధికారులు

ఆత్మకూరులో కొలగాని రామయ్యసత్రంకు చెందిన 2.65 ఎకరాల భూమిలో 1.10 ఎకరాలు వెటర్నరీ ఆస్పత్రికి కేటాయించారు. మిగతా భూముల్లో పేదలు డెబ్బై ఏళ్లగా వంద మందికి పైగా నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారు. ప్రస్తుతం ఆ సత్రం భూములను ఖాళీ చేయించి దేవదాయశాఖ స్వాధీనం చేసుకోవాలని మంత్రి ఆనం ఆదేశాల మేరకు కలెక్టర్ ఉత్తర్వులిచ్చారు. మరి నెల్లూరు నగరంలోని వందల కోట్ల విలువైన ఉగ్రనరసింహుడు ఆ శ్రీహరి భూముల మాటేమిటి మంత్రి గారు... కలెక్టర్ గారు. ఆ దేవదేవుడి ఆస్తులన్నీ దశాబ్దం ఇవతల నుంచే పరుల పరాధీనంలోకి వెళ్లాయి. భారీ భవంతులు నిర్మాణం అయ్యాయి. ఈ భూములన్నీ బడాబాబుల చేతుల్లో ఉండడంతో వాటి జోలికెళ్లడానికి మంత్రులు, అధికారులు సాహసించడం లేదు. అదే పేదలు దాదాపు ఏడు దశాబ్దాలుగా నివాసాలు ఉండే కొలగాని భూములను మాత్రం స్వాధీనం చేసుకునేందుకు సిద్ధపడుతున్నారు.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలోని రాపూరు మండలం పెంచలకోనలో కొలువైన శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారికి నిత్య కైంకర్యాల నిమిత్తం దాత ఇచ్చిన ఆస్తులు అన్యాక్రాంతమయ్యాయి. సదరు భూముల్లో కళ్లు జిగేలుమనేలా వ్యాపార సముదాయాలు కళ్ల ముందు కనిపిస్తున్నా.. జిల్లాకు చెందిన మంత్రులు, కలెక్టర్ కళ్లప్పగించి చూస్తున్నారు. పేదలు నివాసాలు ఉంటున్న భూములు అవి దేవదాయశాఖ భూములని సదరు పెద్దలకు ఏడు దశాబ్దాలు తర్వాత గుర్తుకు వచ్చాయి. కానీ పెద్దల చేతుల్లోని ఉగ్రనారసింహుడి భూములు మాత్రం కనిపించవు. ఆలయాల ఆస్తుల పరిరక్షణ విషయంలో దేవదాయశాఖ వ్యవహరిస్తున్న తీరు పలు అనుమానాలకు తావిస్తోంది. నగర బొడ్డున దాదాపు రూ.500 కోట్లు విలువ చేసే ఆలయ భూములు ఆక్రమణలకు గురవుతున్నా ఆ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ఆక్రమణదారులు కోట్లాది విలువైన ఖరీదైన భూములను కబ్జా చేసి భారీ భవంతుల నిర్మాణాలు చేసుకున్నారు.

నెల్లూరు నగరబొడ్డున శ్రీహరినగర్ ప్రాంతంలో దాదాపు రూ.500 కోట్ల విలువ చేసే పెంచల నరసింహస్వామికి చెందిన భూమిని ఆక్రమించారు. ఆరేళ్ల క్రితం ఆ దేవాలయానికి దాత ఇచ్చిన డాక్యుమెంట్లు వెలుగులోకి వచ్చాయి. అంతటి ఖరీదైన భూములను కొందరు అక్రమార్కులు ఆక్రమించుకుని విక్రయించుకుంటున్నారు. గత ఆరు నెలల క్రితం కూడా ఆ భూముల్లో అక్రమార్కులు తాత్కాలిక షెడ్లు రెంట్‌లకు ఇచ్చేశాడు. ఇదంతా ఉన్నతాధికారులు కళ్లెదుట జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఆత్మకూరులో ఆక్రమణ చేసింది పేదవర్గాలే. నెల్లూరులో ఆక్రమణలు చేసింది అందరు ధనవంతులే కానీ జిల్లా అధికారులు పేద వర్గాలను టార్గెట్ చేసి వారిని ఖాళీ చేయించే ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ నెల్లూరు ధనవంతుల జోలికి వెళ్లడం లేదు. అధికారుల చోద్యం చూస్తేంటే పలు అనుమానాలకు తావిస్తోంది.

రాపూరుకు చెందిన కోట నరసయ్య శెట్టి నెల్లూరు రంగనాయకులపేటలో 184 అంకణాల స్థలాన్ని, నగర నడిబొడ్డున ఉన్న మినీబైపాస్ ఆనుకుని 10.02 ఎకరాలు, ఇందుకూరుపేట పోతురాజు దిబ్బలో 11.35 ఎకరాల వ్యవసాయ భూమిపై వచ్చే ఆదాయాన్ని రాపూరు మండలం పెంచలకోన నరసింహస్వామి దేవస్థానంలో కార్యక్రమాల నిర్వహణకు వినియోగించాలని 1942లో ట్రస్టు డీడ్‌ను రాశారు. ఆయన కోరిక మేరకు స్వామివారి జయంతి వేడుకల్లో అన్నదానం దాత గృహం వద్ద ప్రతి నిత్యం ఐదుగురు బ్రాహ్మణలకు, ఇతరులకు అన్నదానం నిర్వహించాలి. ఆయనకు సంతానం లేకపోవడంతో అన్న కుమారుడిని ట్రస్టీగా పెట్టి సదరు ఆస్తులపై వచ్చే ఆదాయంతో పైకార్యక్రమాలను నిర్వహించిన తదుపరి వారసులుగా మిగతా ఆదాయాన్ని అనుభవించే హక్కును కల్పించారు. ఆస్తులను విక్రయించే హక్కులను మాత్రం ఇవ్వలేదు.

➡ ట్రస్ట్ డీడ్ ఉన్న విషయం 2018 వరకు దేవదాయ శాఖకు సమాచారం లేకుండా దాత కుటుంబీకులు గుట్టు చప్పుడు కాకుండా ఆస్తులను విక్రయించుకున్నారు. 2018లో వెలుగు చూసిన డీడ్ ప్రకారం దేవదాయశాఖ విచారణ చేసి శాఖకు ఆ భూములు, స్థలాలు చెందుతాయని నిర్ధారించి శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం అనుబంధంగా కోట నరసయ్యశెట్టి స్పెసిఫిక్ ఎండోమెంట్ (నిర్దిష్ట ధర్మదాయం) పరిధిలోకి బదలాయించి ఆస్తుల క్రయవిక్రయాలను నిషేధిస్తూ 22 ఏ (సీ) జాబితాలోకి చేర్చారు. ఇది జరిగి ఆరేళ్ల పూర్తయినా సదరు ఆస్తులను నిషేధిత జాబితాలో చేర్చి అధికారులు చేతులు దులుపుకున్నారే తప్పా ఆ ఆస్తులను స్వాధీనం చేసుకుని సంరక్షణ బాధ్యతలు చేపట్టలేదు. రంగనాయకులపేటలో విలువైన స్థలాన్ని కబ్జా చేస్తున్నా చర్యలు లేవు.



మినీ బైపాస్ రోడ్డులో ఆలయ భూమిలో ఏర్పాటు చేసిన దాబా

టీడీపీ ఆఫీస్ కూడా ఆక్రమణే

మినీబైపాస్ ఆనుకుని టీడీపీ కార్యాలయం పరిధి కూడా దేవదాయ ఆస్తుల కింద వస్తుంది. కానీ గతంలో ఆ భూములను ట్రస్ట్ డీడ్ వెలుగులోకి రాకముందే విక్రయాలు జరగడంతో పార్టీ కార్యాలయం నిర్మాణం పూర్తి చేసుకున్నారు. టీడీపీ కార్యాలయమే కాదు దాదాపు ఆ పరిసర ప్రాంతాల్లో 10 ఎకరాలకు పైగా రూ.500 కోట్ల ఆస్తులు చేతులు కూడా మారాయి. టీడీపీ కార్యాలయం ఎదురుగా ఖాళీగా ఉన్న రూ.కోట్ల విలువ చేసే భూములు కూడా ఆక్రమణలకు గురయ్యాయి.. ఇంకా దురాక్రమణలు జరుగుతూనే ఉన్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో అంకణం విలువ దాదాపు రూ.10 లక్షలు ధర పలుకుతుంది. ఇప్పటికే అక్కడ విలువైన భూములను దురాక్రమణ చేసి అక్రమార్కులు విక్రయాలు చేశారు. అది నగర నడిబొడ్డు కావడంతో అన్యాక్రాంతమైన భూముల్లో భారీ భవంతులు వెలిశాయి. ఇప్పటికైనా ప్రస్తుతం ఖాళీగా ఉన్న భూములను కూడా దేవదాయశాఖ పరి రక్షించుకోవాల్సి ఉన్నా ఆ దిశగా అడుగులు వేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.



పెంచలకోన ఆలయ భూమిలో ఏర్పాటు చేసిన మరో షోరూం

బిందుమేనన్ ఫౌండేషన్ సేవలు భేష్

- కలెక్టర్ ఆనంద్



పోస్టర్లు ఆవిష్కరించి కలెక్టర్ ఆనంద్, డాక్టర్ బిందుమేనన్

నెల్లూరు(అర్బన్): డాక్టర్ బిందుమేనన్ ఫౌండేషన్ ద్వారా నిరుపేద ప్రజలకు గ్రామీణ ప్రాంతాల్లో ఉచితంగా న్యూరాలజీ స్పెషాలిటీ సేవలు అందించడం అభినందనీయమని కలెక్టర్ ఆనంద్ కొనియాడారు. ఫౌండేషన్ ఏర్పాటు చేసి 12వ సంవత్సరంలో అడుగు పెడుగుతున్న సందర్భంగా నెల్లూరులోని రామమూర్తినగర్‌లో వార్షికోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఉచిత న్యూరాలజి వైద్యశిబిరాన్ని కలెక్టర్ ఆనంద్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఉచిత న్యూరాలజీ సేవలకు సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. ఆరోగ్య భద్రత విషయంలో డాక్టర్ బిందుమేనన్ న్యూరాలజీ ఆన్ వీల్స్ అనే ప్రత్యేక మైన వాహనంలో అన్ని వైద్య పరికరాలు ఏర్పాటు చేసుకుని తనతో పాటు మరికొంత మంది డాక్టర్లను తీసుకుని వెళ్లి ప్రతి శనివారం, ఆదివారాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఇళ్ల వద్దనే ఏర్పాటు చేయడం పేదలకు ఎంతో ఉపయోగమన్నారు. ఫిట్స్, ఎపిలెప్సి స్ట్రోక్ వంటి వాటిపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకునేలా చేయడం స్ఫూర్తిదాయకమన్నారు. ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ బిందుమీనన్ మాట్లాడుతూ ఇప్పటి వరకు గ్రామీణ ప్రాంతాల్లో 250 ఉచిత వైద్యశిబిరాలు, 248 అవగాహనా సదస్సులు ఏర్పాటు చేశామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఫిట్స్, ఇతర బ్రెయిన్ స్ట్రోక్ కేసులకు సంబంధించి ఉచిత వైద్యసలహాలు, వైద్యం అందించేందుకు న్యూరాలజికల్ మొబైల్ యాప్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఉచిత వైద్యం అందించేందుకు తనను ప్రోత్సహిస్తున్న ఫౌండేషన్ చైర్మన్ కేఎంఆర్ నంబియార్, వైస్ చైర్మన్ భార్గవి నంబియార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పలువురు రోగులకు కలెక్టర్ చేతుల మీదుగా ఉచిత మందుల కిట్‌ను అందజేశారు.

- ఇసుక డ్రెడ్జింగ్ కాంట్రాక్టర్లకు బెదిరింపులు
- సూరాయపాళెం రీచ్ వద్ద సోమిరెడ్డి మనుషుల హల్‌చల్
- కలెక్టర్ ఓవరాక్షన్ అంటూ దూషణ
- ఎమ్మెల్యేను ప్రసన్నం చేసుకోవాలని హెచ్చరిక

రూ. వందల కోట్లకు సోమిరెడ్డి స్కెచ్

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: రీచ్ టు రిచ్‌కు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి భారీగానే ప్లాన్ వేశారని స్పష్టమవుతోంది. ఇసుక అక్రమ రవాణా ద్వారా రూ.వందల కోట్లు సంపాదించాలని టార్గెట్‌గా పెట్టుకున్న ఆయన మనుషులు సూరాయపాళెం ఇసుక రీచ్‌లో సాగించిన హెచ్చరికలు, దూషణల పర్వం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. డ్రెడ్జింగ్ విధానంలో ఇసుక వెలికి తీసేందుకు వచ్చిన గుంటూరుకు చెందిన శ్రీకృష్ణ శాండ్ అండ్ ఫెర్రీ బోర్డ్ వర్కర్స్ అండ్ అదర్ వర్క్స్ లేబర్ కాంట్రాక్ట్ కో–ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ కాంట్రాక్టర్లను సోమిరెడ్డి మనుషులు బెదిరించారు. పొదలకూరు మండలం సూరాయపాళెం ఇసుక రీచ్ నుంచి అక్రమంగా ఇసుకను తరలించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్న సోమిరెడ్డి తన మనుషులను రీచ్ వద్దకు పంపి డ్రెడ్జింగ్ వినియోగించే పడవలను వెనుక్కి పంపే ప్రయత్నం చేశారు. సాక్షాత్తు కలెక్టర్‌నే తూలనాడారు. స్థానిక శాసన సభ్యుడిని కాదని మీరు ఏమి చేయలేరని, ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని బెదిరింపులకు దిగారు. చంద్రబాబునాయుడు స్థానిక ఎమ్మెల్యేలకు ఇసుక రీచ్‌లను నామినేషన్ పద్ధతిలో కట్టబెట్టాలని చూస్తున్నారని చెప్పారు. మధ్యలో కలెక్టర్ ఓవరాక్షన్ చేస్తున్నాడంటూ బూతు పురాణం అందుకున్నాడు. కలెక్టర్ నుంచి కాంట్రాక్ట్ తీసుకున్న కాంట్రాక్టర్లు పద్ధతి ప్రకారం డ్రెడ్జింగ్ చేసేందుకు వచ్చారు. అయితే సోమిరెడ్డి అనుచరులు డ్రెడ్జింగ్ ద్వారా ఇసుకను వెలికి తీస్తే ఎలాంటి ఆదాయం ఉండదని, మధ్యలో ఇసుక దిబ్బలను ఎత్తాలని సూచించారు. ఇందు కోసం తాము 300 ట్రిప్పుల గ్రావెల్ తోలి రీచ్‌కు దారులు ఏర్పాటు చేస్తున్నామని, రూ.కోట్లు ఖర్చు పెడుతున్నట్లు చెప్పారు. ఆయన (సోమిరెడ్డి) ఇంత చేస్తుంటే.. మీరు ఆయనకు తెలియకుండా ఏమైనా చేసినట్లు తెలిస్తే చాలా గొడవలు అవుతాయంటూ కంఠస్వరం పెంచుతూ మాట్లాడారు. ఈ మాటలను బట్టి చూస్తే ఉచిత ఇసుక పాలసీ డొల్లతనం ఇట్టే అర్థం అవుతోంది. టీడీపీ ఎమ్మెల్యేలు, తమ్ముళ్లు ఇసుక ద్వారా సొమ్ము చేసుకోవాలని ఎంతగా పరితపిస్తున్నారో తెలుస్తోంది. ఓ పక్కన రైతులు ఇసుక తోడేస్తే భూగర్భ జలాలు అడుగంటుతాయని, పర్యావరణకే ముప్పు ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే టీడీపీ నాయకులు ఇసుక ద్వారా అక్రమ సంపాదనకు తమ లక్ష్యాలను నిర్దేశించుకుని వెనుక్కు తగ్గడమే లేదు.



డ్రెడ్జింగ్ కాంట్రాక్టర్లను బెదిరిస్తున్న సోమిరెడ్డి ముఖ్య అనుచరుడు

బాణసంచాను తయారు చేసే ప్రాంతాలు, గోదాముల వద్ద పటిష్ట రక్షణ చర్యలుండాలి. అయితే చాలా మంది నిర్వాహకులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. 2016లో తయారీ కేంద్రంలో పేలుడు సంభవించి 14 మంది చనిపోయారు. అయినా యంత్రాంగం పాఠాలు నేర్చుకోలేదు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా నెల్లూరు రూరల్‌లోని ఓ బాణాసంచా గోదాములో మంటలు ఇటీవల చెలరేగాయి. ఒక వాచ్‌మెన్ సజీవ దహనమయ్యారు. మరొకరు ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. ఇలాంటివి జరిగినప్పుడే ప్రభుత్వం, అధికారులు హడావుడి చేస్తున్నారు. పక్కా ప్రణాళికతో చర్యలు చేపడితే ప్రాణాలకు భద్రత ఉంటుంది.

బాణసంచా తయారీ..
నిబంధనలు గాలికి..

గోదాముల్లో వేల కిలోల నిల్వలు

- నామమాత్రంగా రక్షణ చర్యలు
- 2016లో పేలుడు సంభవించి 14 మంది మృతి
- రూరల్‌లో ఇటీవల జరిగిన ప్రమాదంతో ఉలిక్కిపడిన ప్రజలు
- ఏదైనా జరిగినప్పుడే అధికారుల హడావుడి
- ఆ తర్వాత పట్టించుకోని వైనం



కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు సమీపంలోని గోదాములో మంటలు ఆర్పుతున్న సిబ్బంది (ఫైల్)

నెల్లూరు(క్రైమ్): అగ్నిమాపక, రెవెన్యూ, పోలీస్ శాఖల సమన్వయంతోనే అనధికార బాణసంచా విక్రయాలు, నిల్వలు, తయారీని గుర్తించే అవకాశం ఉంది. అయితే పర్యవేక్షణ ఒకరిది.. తనిఖీలు వేరొకరివి అనే రీతిలో పరిస్థితి ఉంది. దీంతో మూడు తారాజువ్వలు.. ఆరు చిచ్చుబుడ్లుగా వ్యాపారం సాగుతోందనే విమర్శలున్నాయి. అనుకోని ప్రమాదం చోటుచేసుకుంటే బాధ్యులెవరని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నెల్లూరు, ఆత్మకూరు, కావలి, కందుకూరు పరిధిలో బాణసంచా గోదాములు, విక్రయ కేంద్రాలున్నాయి. శివకాశీ నుంచి పెద్ద ఎత్తున దిగుమతి చేసుకొని చిరువ్యాపారులకు విక్రయిస్తుంటారు. ఇది ఏటా జరిగే తంతు. అయితే పర్యవేక్షించాల్సిన ప్రభుత్వ పెద్దలు, అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తున్నా..

జిల్లాలోని బాణసంచా గోదాములు, విక్రయ, తయారీ కేంద్రాలను సంబంధిత అధికారులు తనిఖీ చేయాల్సి ఉంది. వారు నిబంధనలు పాటిస్తున్నారా.. అనుమతి మేరకే నిల్వలు ఉన్నాయా.. అగ్ని నిరోధక పరికరాలను ఏర్పాటు చేసుకున్నారా.. నివాస ప్రాంతాలకు దూరంగా ఉన్నాయా.. తదితరాలపై తనిఖీ చేయాల్సి ఉంటుంది. అయితే ఈ దిశగా ఎవరూ స్పందించడం లేదనే విమర్శలున్నాయి. ఎక్కడైనా ప్రమాదం చోటుచేసుకుంటే అప్రమత్తమయ్యామంటూ అధికారులు హడావుడి చేసి ప్రత్యేక కమిటీలను నియమించి అనుమతులపై ఆరా తీస్తున్నారు. అనంతరం అటు వైపుగా దృష్టి సారించడం లేదు. తాజాగా కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు సమీపంలోని భవానీ ట్రేడర్స్ విక్రయ దుకాణంలో పరిమితికి మించి స్టాక్‌ను నిల్వ చేశారని సమాచారం. ప్రభుత్వం, అధికారులు ముందే చర్యలు చేపట్టి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని పలువురు పేర్కొంటున్నారు.

విస్మరించి..

జిల్లా వ్యాప్తంగా బాణసంచా తయారీ, గోదాములు, విక్రయ కేంద్రాలకు సంబంధించి 20లోపే అనుమతులున్నాయని తెలుస్తోంది. అయితే అనధికారికంగా పెద్దసంఖ్యలోనే ఉన్నాయి. జిల్లా కేంద్రంలోనే ఐదు వేల కిలోల వరకు నిల్వ ఉన్న గోదాములున్నాయని సమాచారం. మిగిలిన ప్రాంతాల్లో గోదాములు, దుకాణాలకు 1500 కిలోల వరకు నిల్వకు అనుమతులున్నాయని తెలుస్తోంది. అయితే నిబంధనలను ఉల్లంఘించి వేల కిలోల సరుకును నిల్వ ఉంచి విక్రయాలు సాగిస్తున్నారు. ఇక గోదాములు, దుకాణాల వద్ద నిబంధనల మేరకు జాగ్రత్తలు పాటించడంలేదనే ఆరోపణలున్నాయి. ఫైర్ సేఫ్టీ పరికరాలను ఏర్పాటు చేసినా పలుచోట్ల అవి కేవలం అలంకారప్రాయంగానే మిగిలిపోయాయి. వీటికి తోడు మిగిలిన వ్యాపారాలకు సంబంధించిన గోదాములు మూడు వేలకు పైగా ఉన్నాయని సమాచారం. వీటికి ఎలాంటి అనుమతుల్లేవు. దీంతో ప్రమాదాలు సంభవించినప్పుడు తీవ్ర స్థాయిలో ఆస్తి నష్టం వాటిల్లుతోంది. సంబంధిత అధికారులు ఇప్పటికైనా తనిఖీలు నిర్వహించి నిబంధనలు పాటించని వారిపై చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇవీ నిబంధనలు



అగ్నికీలల్లో భవానీ ట్రేడర్స్ బాణసంచా గోదాము (ఫైల్)

- తయారీ కేంద్రాల్లో ముడిసరుకు నిల్వ ఒకచోట, తయారీ వేరేచోట జరగాలి. నివాసిత ప్రాంతాలకు దూరంలో ఉండాలి.
- తయారీ కేంద్రాల్లో 25 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన నీటి ట్యాంక్‌లను అందుబాటులో ఉంచాలి.
- హైడ్రెంట్ పైప్‌లైన్ పాయింట్లు, అగ్నిమాపక పరికరాలు, డీజిల్ పంప్ తప్పనిసరి. సిబ్బంది పరిమితంగా ఉండాలి.
- విద్యుద్దీకరణపై జాగ్రత్త వహించాలి
- ప్రమాదం జరిగితే కార్మికులను హెచ్చరించేలా అలారమ్‌ను విధిగా ఏర్పాటు చేయాలి.

గతంలో..

- కొన్నేళ్ల క్రితం నెల్లూరు పొర్లుకట్ట వద్ద ఓ ఇంట్లో పెద్ద ఎత్తున నిల్వ ఉంచిన బాణసంచా పేలి నలుగురు మృతిచెందారు.
- 2009లో పెన్నానది సమీపంలో బాణసంచా తయారీ క్రమంలో పేలుడు సంభవించి ముగ్గురు చనిపోయారు.
- 2012లో ఆత్మకూరులోని రఫీ ఫైర్ వర్క్స్‌లో అగ్నిప్రమాదం జరిగి నలుగురు మరణించారు.
- 2016లో కావలిలోని మద్దూరుపాడులో బాణసంచా తయారీ కేంద్రంలో అగ్నిప్రమాదం సంభవించింది.
- 2016 చివర్లో పెన్నా పొర్లుకట్ట వద్ద తయారీ కేంద్రంలో పేలుడు సంభవించి ఏకంగా 14 మంది మృతిచెందారు.
- కొన్నేళ్ల క్రితం సర్వేపల్లి నియోజకవర్గ పరిధిలో బాణసంచా గోదాముల్లో అగ్నిప్రమాదం జరిగి పెద్ద ఎత్తున ఆస్తి నష్టం వాటిల్లింది.



- తాజాగా కల్లూరుపల్లి ఘటనలో ఒకరు సజీవ దహనమయ్యారు.

క్లుప్తంగా

కొండచిలువ కలకలం



సంగం: భారీ కొండచిలువ సంచారంతో కలకలం రేగిన ఘటన సంగం డంపింగ్ యార్డు వద్ద శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఈ పరిణామంతో అక్కడ విధులు నిర్వర్తిస్తున్న సచివాలయ సిబ్బంది భయంతో పరుగులు తీశారు. కాగా యార్డు వద్ద రాత్రి వేళ విద్యుత్ సరఫరా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని సిబ్బంది వాపోయారు.

గడ్డి వాములు దగ్ధం

- రూ.75 వేల నష్టం



మంటలను అదుపులోకి తీసుకొస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సోమశిల: మూడు గడ్డి వాములు దగ్ధమైన ఘటన అనంతసాగరం మండలంలోని పాతదేవరాయపల్లిలో శనివారం చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల మేరకు.. గడ్డివాముల నుంచి పొగలతో కూడిన మంటలు ఎగసిపడటంతో స్థానికులు గమనించి అదుపు చేసేందుకు యత్నించారు. ఆత్మకూరు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించడంతో వారు ఘటన స్థలానికి చేరుకొని ఆదివారం ఉదయం వరకు శ్రమించి మంటలను పూర్తిస్థాయిలో అదుపులోకి తీసుకొచ్చారు. ప్రమాదంలో గ్రామానికి చెందిన చింతంరెడ్డి కృష్ణారెడ్డి, చింతంరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డికి చెందిన 13 ఎకరాల గడ్డి వాములు అగ్నికి ఆహుతయ్యాయి. దీని విలువ రూ.75 వేలు ఉంటుందని చెప్పారు.

కుప్పకూలి వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్): లాడ్జిలో వ్యక్తి మృతి చెందిన ఘటనపై సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నంద్యాల జిల్లా ఆత్మకూరు మండలం సున్నిపెంటకు చెందిన రామాంజనేయులు (44) నగరంలోని ఏటీ అగ్రహారంలో గల ధనలక్ష్మి లాడ్జిలో ఏడాదిగా ఉంటున్నారు. పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఆయన అనారోగ్యంతో కొంతకాలంగా బాధపడుతున్నారు. ఈ తరుణంలో లాడ్జిలో ఫోన్లో శనివారం సాయంత్రం మాట్లాడుతూ మెట్ల వద్ద కుప్పకూలిపోయారు. గమనించిన లాడ్జి సిబ్బంది 108కు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకొని రామాంజనేయులును పరిశీలించగా, అప్పటికే మృతి చెందారని నిర్ధారించారు. ఈ మేరకు పోలీసులకు లాడ్జి మేనేజర్ మస్తానయ్య ఫిర్యాదు చేశారు. ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

చేజర్ల: కాపురానికి భార్య రాలేదనే మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని మాముడూరులో శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఏఎస్సై నాగరాజు వివరాల మేరకు.. కూలీ పనులు చేసుకొని జీవనం సాగించే మాముడూరుకు చెందిన బధిరుడు అబ్దుల్ రహీం (40)కు భార్య ఆసియా, ఇద్దరు పిల్లలున్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది జనవరిలో అబ్దుల్ రహీంతో భార్య గొడవపడి పిల్లలతో సహా తన స్వగ్రామమైన పొదలకూరు మండలం ఇరువూరుకు వెళ్లిపోయారు. ఈ క్రమంలో మనస్తాపానికి గురై రెండుసార్లు ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. తాజాగా శనివారం మధ్యాహ్నం 2.30 గంటల ప్రాంతంలో తన ఇంట్లో పురుగుమందును ఆయన సేవించారు. అనంతరం పక్కింట్లో ఉన్న తన సోదరుడి భార్య వద్దకెళ్లి ఈ విషయాన్ని సైగల ద్వారా తెలియజేశారు. చికిత్స నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రికి.. అనంతరం ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా, అక్కడ మృతి చెందారు. మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఉద్యోగం పేరిట వంచనకు గురై..

- ప్రాణం పోతోందంటే నమ్మి క్రెడిట్ కార్డులిచ్చి.. ఆపై మోసపోయి
- యువకుడి ఆత్మహత్య



హరినాథ్ మృతదేహం

నెల్లూరు(క్రైమ్): ఉద్యోగం పేరిట వంచనకు గురై.. అడిగినంత మొత్తాన్ని సమర్పించి.. బ్యాంకుల నుంచి ఒత్తిళ్లు తాళలేక యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. వివరాలు.. నవాబుపేటలోని మంగళవీధికి చెందిన హరినాథ్ (44) డిగ్రీ చదువుకున్నారు. ఉద్యోగాన్వేషణలో ఉన్న సమయంలో తల్లిదండ్రులు సత్యనారాయణ, సుమతి అనారోగ్యంతో మరణించారు. మానసికంగా కుంగిపోయిన హరినాథ్‌ను చిన్నాన్న ప్రకాశ్‌రావు చేరదీసి అండగా నిలిచారు. ఈ తరుణంలో బెంగళూరులోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో హరినాథ్‌కు నాలుగేళ్ల క్రితం ఉద్యోగం లభించింది. నెలకు రూ.30 వేలకుపైగా జీతం వస్తున్నా, ఉన్నతస్థాయి కంపెనీలో చేరేందుకు యత్నాలు ప్రారంభించారు. ఈ తరుణంలో తన ఇంటికి సమీపంలో ఉంటున్న ప్రేమ్‌చంద్‌తో పరిచయమైంది. ఓ ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగమిప్పిస్తానని నమ్మబలికి ప్రాసెసింగ్ ఫీజు కింద రూ.1.2 లక్షలను తీసుకున్నారు.

క్రెడిట్ కార్డులు సమర్పించి..

ఉద్యోగాన్ని ప్రాసెస్ చేసే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారని.. అతనికి డబ్బులు అవసరమని.. సర్దుబాటు చేస్తే తిరిగి చెల్లిస్తారని ప్రేమ్‌చంద్ నమ్మబలికారు. దీంతో తన క్రెడిట్ కార్డులను హరినాథ్ ఇచ్చారు. కార్డుల నుంచి రూ.ఐదు లక్షలను డ్రా చేసుకొని, ఇంకా డబ్బులు అవసరమని చెప్పారు. దీంతో హరినాథ్ తన తల్లి బంగారాన్ని కుదువ పెట్టి.. లోన్ ద్వారా వచ్చిన రూ.1,98,700 మొత్తాన్ని ఫోన్‌పే చేశారు. రోజులు గడుస్తున్నా, ఉద్యోగం లభించకపోవడం.. నగదు చెల్లించకపోవడంతో ప్రేమ్‌చంద్‌ను బాధితుడు నిలదీశారు. అకౌంట్‌లో రూ.5.57 లక్షలను జమచేశానని నకిలీ స్లిప్పులు చూపారు. బ్యాంక్‌కు వెళ్లి తన ఖాతాను బాధితుడు పరిశీలించగా, నగదు జమకాలేదనే విషయం తేలింది. అప్పటి నుంచి ప్రేమ్‌చంద్ తన ఫోన్‌ను స్విచ్ఛాఫ్ చేసి ఎటో వెళ్లిపోయారు. తనకు జరిగిన మోసంపై నవాబుపేట పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేయడంతో ఈ నెల ఐదో తేదీన కేసు నమోదు చేశారు. సాంకేతికత ఆధారంగా నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

బ్యాంకుల నుంచి ఒత్తిళ్లు తాళలేక..

క్రెడిట్ కార్డులకు సంబంధించిన నగదు చెల్లించాలని బ్యాంకుల నుంచి ఒత్తిళ్లు అధికమవడంతో హరినాథ్ మనస్తాపానికి గురయ్యారు. ఈ తరుణంలో ఐదో తేదీ అర్ధరాత్రి తన ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. సమాచారం అందుకున్న నవాబుపేట పోలీసులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు కారణమైన ప్రేమ్‌చంద్ కోసం గాలిస్తున్నామని తెలిపారు.

వేళాంగణిమాత చర్చిలో ప్రార్థనలు



ప్రత్యేక ప్రార్థనలు



కోడూరులో సముద్రస్నానాలు చేస్తున్న భక్తులు

తోటపల్లిగూడూరు: కోడూరులోని వేళాంగణిమాత చర్చిలో ఉదయకాల ప్రార్థన, పరిశుద్ధ జపమాల కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. వేళాంగణిమాత జన్మదిన మహోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో దైవ సందేశకులు రెవరెండ్ ఫాదర్లు వరకుమార్, రమేష్, ప్రమోద్, బాస్కో, పీటర్, మరియదాస్ తదితరులు తమ సందేశాన్ని అందించారు.

పోటెత్తిన భక్తులు

వేళాంగణిమాత ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు భక్తులు వేలాదిగా తరలిరావడంతో పుణ్యక్షేత్ర ప్రాంగణం, కోడూరు సాగరతీరం కిక్కిరిసిపోయింది. పలువురు భక్తులు తలనీలాలను సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు. అనంతరం కోడూరు సాగరతీరంలో సముద్ర స్నానాలను ఆచరించి పునీతులయ్యారు. భక్తుల రద్దీ దృష్ట్యా పుణ్యక్షేత్ర డైరెక్టర్ లూకాస్‌రాజ్ తగు ఏర్పాట్లు చేశారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ నెల్లూరు రెండో డిపో నుంచి 14 ప్రత్యేక సర్వీసులను నడిపారు. ఎస్సై వీరేంద్రబాబు ఆధ్వర్యంలో 70 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తును ఏర్పాటు చేశారు.

నేడూ పుణ్యస్నానాలు

వేళాంగణిమాత మహోత్సవాల్లో భాగంగా కోడూరు సాగరతీరంలో పుణ్యస్నానాలను భక్తులు సోమవారం ఆచరించనున్నారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలకు హాజరైన భక్తులు వేళాంగణిమాత పుణ్యక్షేత్రంలో రాత్రి జాగరణ చేస్తారు. ఈ క్రమంలో సోమవారం వేకువజాము నుంచి పుణ్యస్నానాల ప్రక్రియ ప్రారంభంకానుంది.

జ్యువెలరీ షాపులో చోరీ కేసు ఛేదన

- 24 గంటల్లోనే ఇద్దరు నిందితుల అరెస్ట్
- రూ.59.46 లక్షల సొత్తు స్వాధీనం



చోరీ సొత్తుతో ఎస్పీ కృష్ణకాంత్ తదితరులు

నెల్లూరు (క్రైమ్): కందుకూరు పట్టణంలో సంచలనం రేకెత్తించిన జ్యువెలరీ షాపులో దొంగతనం కేసులో ఇద్దరు నిందితులను 24 గంటల వ్యవధిలోనే పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.59.46 లక్షల విలువజేసే సొత్తును స్వాధీనం చేసుకున్నారు. నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో నిందితుల వివరాలను ఎస్పీ కృష్ణకాంత్ వెల్లడించారు. కందుకూరులోని పెద్దబజార్‌కు చెందిన అనుములశెట్టి శ్రీకాంత్ స్థానికంగా గాయత్రి జ్యువెలరీస్‌ను నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు షట్టర్ తాళాలను శనివారం రాత్రి పగలగొట్టి, షాపులోని 760 గ్రాముల బంగారు ఆభరణాలను దొంగలించారు. పక్కనే ఉన్న మూడు కిరాణా షాపుల్లో రూ.25 వేలను అపహరించుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కందుకూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

నిందితులను గుర్తించింది ఇలా..

ఎస్పీ ఆదేశాల మేరకు కందుకూరు డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సీఐ వెంకటేశ్వరరావు, రూరల్ ఎస్సై మహేంద్రనాయక్, సీసీఎస్, సిబ్బంది ప్రత్యేక బృందంగా ఏర్పడి దర్యాప్తును వేగవంతం చేశారు. ఘటన స్థలంలో లభ్యమైన ఆధారాలు, సాంకేతికత ఆధారంగా నిందితులు సీతారామపురం బెస్తకాలనీకి చెందిన బాలనారాయణ, అతని సోదరుడని గుర్తించారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. చోరీ చేసిన సొత్తును విజయవాడలో విక్రయించేందుకు ఆదివారం యత్నిస్తుండగా, ప్రత్యేక బృందం అరెస్ట్ చేసింది. నిందితుల నుంచి రూ.56,28,440 విలువజేసే 760 గ్రాముల బంగారుతో పాటు రూ.3.18 లక్షలను స్వాధీనం చేసుకున్నారు.

జల్సాలకు అలవాటుపడి..

జల్సాలకు అలవాటుపడిన నిందితులు చదువుకు స్వస్తి పలికి దొంగలుగా అవతారమెత్తారు. బాలనారాయణపై ఒంగోలులో ఓ కేసు ఉండగా, జువెనైల్‌పై కనిగిరి, పొదిలిలో రెండు చొప్పున, ఒంగోలు, సీతారామపురంలో ఒక కేసు, శ్రీకాకుళం జిల్లా పలాస.. ప్రకాశం జిల్లా టంగుటూరు పోలీస్‌స్టేషన్లలో దొంగతనం కేసులున్నాయి. గాయత్రి జ్యువెలరీస్‌లో దొంగతనం చేసేందుకు ముందురోజు టంగుటూరులో చోరీ చేశారని ఎస్పీ తెలిపారు.

సిబ్బందికి నగదు ప్రోత్సాహకాలు

కేసును 24 గంటల వ్యవధిలోనే ఛేదించిన కందుకూరు డీఎస్పీ, సీఐ, రూరల్ ఎస్సై, క్లూస్‌టీం ఎస్సై బ్రహ్మయ్య, కానిస్టేబుళ్లు హరిబాబు, రవితేజ, సీసీఎస్ కానిస్టేబుళ్లు విజయ్‌బాబు, మహబూబ్‌బాషా, కిశోర్‌బాబు తదితరులను ఎస్పీ అభినందించి ప్రశంసపత్రాలు, రివార్డులను అందజేశారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 116	లేయర్ (లైవ్)	: 105
బ్రాయిలర్ చికెన్	: 214	బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 236
లేయర్ చికెన్	: 178		

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	: రూ.100
సన్నవి	: రూ.60
పండ్లు	: రూ.40